# 21. సమస్య

ఆనాడు యేమీ తోచక, పాతస్నేహితుడు ప్రకాశం ఇంటికి వెళ్ళాను. ప్రకాశానిక్కూడా యేమీ తోచటంలేదు కాబోలు, ఎక్కడికో బయలుదేరబోతూ గుమ్మం దగ్గరే నాకు యెదురైనాడు.

"నవాబుగారు ఎక్కడికో ప్రయాణమైనట్టు వుందే?" నేను అన్నాను ప్రకాశంవైపు ప్రశ్నార్థకంగా చూస్తూ.

"ఆ ఎక్కడికీలేదు. అల్లా కృష్ణవొడ్డుకువెళ్ళి కాస్త చల్లగాలి మేద్దామని-"

"అంతేనా? ఇంకెక్కడికైనానా?"

"ఆ మాట ఇక్కడ అంటే అన్నావుకాని కొంపతీసి మా ఆవిడ దగ్గర మాత్రం అనవోక."

నేను నవ్వాను.

"వస్తావా- అల్లా వెళ్దాం" ప్రకాశం నన్ను అడిగాడు.

"సరేపా - నిరుద్యోగులకు బలాదూర్లకన్న చేసేపనేముంది?"

ఇద్దరమూ కలసి కృష్ణవైపు బయలుదేరాం. ఎండాకాల మవటంవల్ల ఆనకట్ట కిందిభాగంలో కొన్ని ఇసుకతిన్నెలు ఏర్పడ్డాయి. మెల్లిగా మేమొక ఇసుకతిన్నెను ఆక్రమించాం. ఆనకట్ట పైభాగంనుంచి వచ్చే చల్లని పిల్లతెమ్మెరలు శరీరానికి 'హాయి హాయి' అనిపిస్తూవుంది. తీక్షణత తగ్గిన సూర్యకిరణాలు నలుదిక్కులా నృత్యంచేస్తున్నాయి.

కొన్నికొన్ని పక్షులు అంతరిక్షంలో చిన్న చిన్న గుంపులుగా గూళ్ళకు పరువెత్తుతున్నాయి. రెండు నిమిషాలపాటు నడిచివచ్చిన సేదదీర్చుకుంటూ– ఇద్దరమూ కూర్చున్నాం.

మాకు దూరాన రోడ్డు మీదినుంచి ఏదో స్త్రీ శవం శ్మశానానికి వెళ్తూవుంది. ముందు ఒక బ్రాహ్మణుడు నిప్పులున్న మట్టికుండను చేత్తోపట్టుకున్నాడు. ఆయనపక్కనే పురోహితుడు, మరోబంధువుడు వున్నారు. శవానికి వెనకాల మాత్రం కొద్దిమంది మనుషులు విషాదపూరిత వదనాల్తో వెళ్తున్నారు. ఈ దృశ్యాన్ని చూచిన నాకు వివిధ భావాలు రేకెత్తాయి.

ప్రకాశాన్ని తట్టుతూ నేను అడిగాను, "అయితే ప్రకాశం! బొందినవీడిన జీవుడు ఏమవుతుందంటావ్?"

"ఆ మెట్టవేదాంతం ఇప్పుడెందుకోయ్?"

ఒక్క నిమిషం నాకూ యేమీతోచలేదు.

"పోనీ దయ్యాలున్నాయంటావా?"

ప్రకాశం కొంచెం చలించి గట్టిగా ఊపిరి పీలుస్తూ అన్నాడు: "తప్పకుండా వున్నాయిరా."

"ఏమోరా – నే నెప్పుడూ చూడలేదు – చూసేదాకా నాకు నమ్మకం కూడా కుదరదు"– నేను అన్నాను నా అనుమానాన్ని విశదపరుస్తూ.

"పోనీ నేనొక విషయాన్ని చెప్తాను– నమ్ముతావూ?" ప్రకాశం అడిగాడు నా ముఖంలోకి చూస్తూ.

"ఆఁ. ఈ ముసలమ్మకథల్లో నీక్కూడా నమ్మకం వుందీ?"– నేను అన్నాను ప్రకాశం చెప్పబొయ్యేది ఏదో పాత పురాణపు కథ అని ముందుగానే గ్రహించినవాడిలా.

"అది కాదోయ్! నీకిప్పుడు చెప్పబొయ్యేది స్వానుభవం."

ప్రకాశం స్వానుభవాలు వినేందుకు చక్కగా వుంటాయి. సందర్భాను సారంగా స్వానుభవాల్ని విప్పి చెప్పేందుకు ప్రకాశానికి ప్రత్యేక స్థానంవుంది. వాడు చెప్పేవాటిల్లో కోతలు నాకెక్కడా కనపడవు. అందుకనే కుతూహలంకొద్దీ అన్నాను: "అయితే– త్వరగా అక్కథా విధానాన్ని ప్రారంభించు."

"నమ్ముతావా?" – అన్నాడు అనుమానంగా ముందుగానే. ప్రకాశాన్ని తృప్తిపరచేందుకు, "ఆఁ" అని తల ఆడించాను.

ప్రకాశం ఒక సిగరెట్ ముట్టించి, పొగను వూదుతూ స్వీయగాథలోని ఒక అంకాన్ని విప్పటం మొదలుపెట్టాడు:

## 2

“నేను గుంటూరులో బి.ఎ. క్లాసు చదువుతున్నప్పటి రోజులవి.

అరండాల్‌పేటలో ఒక నాయుళ్లఇంట్లో - మేడ మీది గది అద్దెకు తీసుకొని వుండేవాణ్ణి. గదిసరిగ్గా నాకు సరిపొయ్యేదిగా వుండేది, కాబట్టి భాగస్వామి అవసరం లేకపొయ్యాడు. మేడ మీదికి వీధివైపునుంచి మెట్లుండడంవల్ల నేను ఏ అర్థరాత్రి అపరాత్రి వచ్చినా ఎవర్నీ లేపవలసిన అగత్యం వుండేదికాదు. దొడ్లోకి మరోవైపునుంచి మెట్లుండేవి. వీటితో నాకంత అవసరం వుండేదికాదు.

కింది భాగంలో ఆ నాయుడూ, ఆయన భార్య, కూతురు ముగ్గురే వుండేవారు.

నాయుడు సౌమ్యుడు. కలక్టరాఫీసులో అరవై రూపాయిల జీతం తెచ్చుకుంటూ గౌరవంగా జీవించేవాడు. ఆయనది అనుకూల దాంపత్యమనే చెప్పాలి. ఆధునిక అభిప్రాయాల వ్యక్తి అవటంవల్లనే కూతుర్ని హైస్కూలుకు పంపాడు.

అప్పుడప్పుడు ఆయన నా గదికి వచ్చేవాడు. ఇద్దరం యేదో లోకాభి రామాయణంలో పడేవాళ్ళం. మా కాలేజీ వ్యవహారాల్ని నేను - ఆయన ఆఫీసు గొడవల్ని ఆయనా ఒకళ్ళకొకళ్లం చెప్పుకొనేవాళ్ళం.

ఆయన కుమార్తె - ఆమెకు పదిహేను సంవత్సరాల వయస్సు, రూపవతి. కాన్వెంటులో ఫిఫ్తుఫారం చదివేది.

నేను ఆ గదిలో ప్రవేశించాక- నా జీవితంలో మొట్టమొదటిసారి నన్ను ఆమె ఆకర్షించింది. ఆమెను ఎప్పుడూ చూస్తూవుండాలని వుండేది. నా గదికి ఒకటి దొడ్డి వైపుకు, రెండోది వీధీవైపుకు రెండు కిటికీలు వుండేవి. నేను కుర్చీని దొడ్డివైపు కిటికీదగ్గర వేసికొని ఎప్పుడూ దొడ్లోకి చూస్తూ వుండేవాణ్ణి ఆమె కన్పిస్తుందనే ఆశతో. ఆమె అప్పు డప్పుడు మెరుపు మెరిసినట్టుగా దొడ్లోకి వస్తూపోతూవుండేది. ఇదిగాక ఆమె ఉదయాన స్కూలుకు వెళ్ళేటప్పుడు, సాయింత్రం స్కూలునుంచి తిరిగి వచ్చేటప్పుడూ, నాకళ్ళ పడుతూనే వుండేది. ఎవరన్నా చూస్తారనే భయంకూడా లేకుండా - కనురెప్పలు వాల్చకుండా ఆమెను తనివితీరా చూస్తూవుండేవాడ్ని. “అందాన్ని గ్రోలటం” అంటే అదే కాబోలుననుకునేవాణ్ణి. ఆమె కూడా ఒకక్షణం నావైపు చూచేది. మా ఇద్దరి చూపులు కలసినప్పుడు మాత్రం నేను తన్మయుణ్నయ్యేవాణ్ణి. అంతే! ఆమె వెంటనే తలవాల్చి తనదారిని పొయ్యేది. నాకు ఆమె మీద క్రమేపీ ఒక విధమైన ప్రేమ జనించింది. ఆమెతో ఏకాంతంగా మాట్లాడాలని వుండేది. ఈ విషయాల్లో అదే మొదటిఘట్టం కావటంవల్ల కొద్ది జంకుకూడా వుండేది. ఆ భయాన్ని చంపుకునేందుకు శతవిధాల ప్రయత్నించేవాణ్ణి. సమయం చిక్కతే మాత్రం నా మనస్సులో వున్నది

ఆమెకు విప్పి చెప్పేందుకు మాత్రం సంసిద్ధుణ్ణే! కాని ఆ పుణ్యకాలం ఎప్పుడోనని ఎదురుచూస్తూ కూర్చోవలసి వచ్చింది.

ఆనాడు శనివారం. కాలేజీకి శెలవు. ఉదయం కాఫీ తాగివచ్చి యథాస్థానాన్ని చేరుకున్నాను – ఏదో పుస్తకం చదువుకుంటూ.

ఒక అరగంట గడిచేదాకా నా దృష్టి దొడ్డి వైపుకు మరలనేలేదు. ఆ తరువాత చూతును. ఆమె నగ్నంగా నూతి దగ్గర స్నానం చేస్తూ వుంది. ఆ సమయంలో నేనోచిత్రకారుణ్ణయివుంటే వెంటనే ఆమె బొమ్మ గీసేసి వుందును. ఆమె దేహచ్ఛాయలో ఆ లేత సూర్యకిరణాలు ప్రతిఫలిస్తున్నాయి; ఆమె భుజాలవొంపులూ – చెల్లాచెదురుగా పడివున్న ఆమె కురులూ – అబ్బ! ఇప్పటికి కూడా తలుచుకుంటే అదృశ్యం నా కళ్ళముందు కట్టినట్టు వుంటుంది. నా కళ్ళను అప్పగించేసి అల్లా ఎంతసేపు చూస్తున్నానో తెలియదుకాని, ఆమె నన్ను చూచి సిగ్గుతో పక్కనేవున్న చీరెను చుట్టుకొని తలొంచుకొని ఇంట్లోకి పారిపొయ్యేదాకా నాకు తెలివిరాలేదు. ఒక్కసారిగా ఏనుగుకు అంకుశంపోటు తగిలినట్టు అయింది. అప్పుడు నేను నా తప్పును గ్రహించుకున్నాను. నా వెధవబుద్ధికి నాలో నాకే సిగ్గేసింది. అనవసరంగా ఆమె మనస్సు నొప్పించానని నన్ను నేనే తిట్టుకున్నాను.

ఈ సంగతి ఆమె ఇంట్లో చెప్తే నాకు పరువునష్టమే కాకుండా – నాయుడివల్ల చీవాట్లు కూడా తగులుతాయనే భయంవేసింది. ఇల్లాటి విషయాల్ని ఏ స్త్రీ బయట పెట్టదని నాలో నాకే మరోవైపు ధైర్యం.

ఆ క్షణానే ఆ స్థలంనుంచి జండా పీకేశాను. ఏమీ పాలుపోక ఒక స్నేహితుడు గదికి వెళ్ళి ఆ సాయంత్రందాకా అక్కడ గడిపి తిరిగి గది జేరుకున్నాను. కాని నాకు ఎందుకనో గుండెలు పీచు పీచుమంటూనే వున్నాయి. ఆమెను ఎప్పుడన్నా ఒంటరిగా కలుసుకోగలుగుతే – నా తప్పుకు క్షమాపణ అర్పిద్దామనుకున్నాను.

ఇలా వారం గడిచింది. కాని నాయుడికీ, ఎవ్వరికీ తెలియలేదని మాత్రం నాలో నేను రూఢిపరుచుకున్నాను.

ఆనాడు సాయింకాలం కాలేజీ నుంచి వచ్చి రూములో కూర్చొని ఏదో ఆలోచిస్తున్నాను. ద్వారం దగ్గర ఆ అమ్మాయి వచ్చి నిలబడ్డ సంగతి కూడా నేను గమనించలేదు.

ఆమె తలవొంచుకొని నన్ను అడిగింది: "ఇంటి తాళం చెవి మీకు ఇచ్చారా?"

నేను తలెత్తి ఆమెను చూచి కొద్దిగా ఆశ్చర్యపడ్డాను. ఆమె నాతో మాట్లాడటం అదే మొదటిసారి. ఆమె అడిగిన ప్రశ్నకూడా నాకు సరిగ్గా అర్థమవలేదు.

"ఏమిట"ని ఆమెను అడిగాను.

"మా ఇంటి తాళంచెవి మీ చేతికిచ్చారా?" ఆమె మాటల్లో ఒక విధమైన సంగీతం వుందని నేను గ్రహించాను.

"లేదు" అని తేల్చి సమాధానం చెప్పాను.

ఆమె ముఖం ఎత్తి నావైపొకసారి చూచి, తిరిగి వెళ్ళిపోబోయింది. నాకు ఆమెను అల్లానే చూస్తూ వుండాలనిపించింది. ఆమె అంతత్వరగా ఆ స్థలాన్ని వీడివెళ్ళడం నాకు ఇష్టంలేదు.

నాయుడు అప్పుడప్పుడు తన కూతుర్ని గురించి నాతో చెప్తూవచ్చిన దాన్ని బట్టి - ఆమె పేరు సరళనీ, ఆమె ఇంకా కన్య అనీ, ఆమెకు త్వరలోనే వివాహం చేసేందుకు సంబంధం వెదుకుతున్నాడనీ గ్రహించగలిగాను.

ఆమె తిరిగివెళ్తూ వెనక్కు తిరిగి నావైపొకసారి చూచింది. నేను అప్రయత్నంగా ఆమెను పేరుపెట్టి పిలిచాను.

ఆమె "ఎందుకు?" అంటూ తిరిగివచ్చి గది గుమ్మం ముందు నిలబడ్డది.

నాకప్పుడు ఆ శనివారం నాటి ఘటన జ్ఞాపకం వచ్చింది.

"సరళా నన్ను క్షమించవూ?" అని దీనంగా అడిగాను.

"ఎందుకూ?"

"ఆనాడు అప్రయత్నంగా నీవు నూతిదగ్గర స్నానం చేస్తూవుంటే చూచినందుకు-"

ఆమె కొంచెం సిగ్గుపడ్డది.

"అది మీరు చెయ్యాలనే చేశారు- కాదూ?" అంది బొటనవ్రేలు నేల రాస్తూ.

"అందుకే"- అన్నాను నా తప్పును వొప్పుకుంటూ.

"ఫరవాలేదు లెండి-"

నాకిప్పుడు మరింత ధైర్యం వచ్చింది.

"సరళా! మీవాళ్లు వచ్చేదాకా నా గదిలో కూర్చో."

"ఎవరన్నా చూస్తే?"

"ఏమంటారు?"

"అంత నంగనాచిగా మాట్లాడుతారేం?"

"ఫరవాలేదు."

కింద గొళ్లెం తీసిన చప్పుడు.

"ఇప్పుడు కాదులెండి - మావాళ్ళు వచ్చినట్టున్నారు వెళ్తా."

నేనేమీ మాట్లాడలేదు. ఆమె నావైపు చూచి ఒక చిరునవ్వునవ్వి, గిర్రున తిరిగి వెళ్ళిపోయింది. ఆమె జడలో నుంచి జారిపడిన గులాబిపువ్వును వాసనచూస్తూ నేను వెనక నిలువబడిపొయ్యాను.

## 4

"మర్నాడు కాలేజీకి నాగాపెట్టి, పగలంతా అథమం ఆమెను చూచేందుకు కళ్ళు కాయలుకాచేటట్లు, కాచుకు కూర్చున్నానంటే నమ్ము. కాని నా విశ్వప్రయత్న మంతా వ్యర్థమయింది.

ఆ సాయంకాలం నాయుడు నా రూముకు వచ్చాడు. మాటామాటాసందున ఆయన అన్నాడు. "సరళకు ఇవ్వాళ జ్వరం వచ్చిందండీ."

నాకేదో భయం వేసింది; ఆమెకు జ్వరం రావటంవల్లనే ఆమెను ఆనాడు చూడలేకపొయ్యానని నిర్ధారణ చేసుకొన్నాను.

ఇంక మూడు రోజులకే కాలేజీకి దసరా సెలవులు దాపరిస్తాయి. ఆ మూడు రోజుల్లోనూ ఆమెను ఎల్లాగయినా చూద్దామని, ఆమెకు జ్వరం ఎల్లా వుందో తెలుసుకోవాలనీ కుతూహలపడ్డాను. నాకు ఏ సందూ దొరకలేదు.

ఆనాడు రాత్రి బండిలో నేను ఇంటికి వెళ్ళిపోదామని ఆ సాయంత్రానికల్లా సామాను సర్దాను. వెళ్ళబోయే ముందు ఆమెను చూడాలనే కుతూహలం రెట్టించింది.

వెళ్ళబొయ్యే ముందు నాయుడికి చెప్పేందుకు వెళ్ళినట్టుగా – వాళ్ళ యింట్లో ప్రవేశించాను. హాలులో తెల్లని దుప్పటిపరిచిన మంచంమీద సరళ పరున్నది. ఈ మూడురోజుల్లోనూ ఆమె యెంతగా మారిపోయింది! ఆమె ముఖంలోవున్న సగంకాంతి సన్నగిలింది. ఆమె చెక్కిళ్ళ యెరుపు క్షీణించింది. ఆమె కళ్ళలోని కొంటెతనం దీనతగా మారింది. ఆమెను ఆశ్చర్యంగా చూస్తూ ఒక్క నిమిషం అల్లాగే నిలుబడిపొయ్యాను.

ఆమెకూడా సగం మూతలుపడ్డ కనురెప్పల కిందినుంచి నన్ను చూచింది. ఆ చూపుల్లోని దీనత్వం నన్ను ఆ క్షణంలో అక్కడ బంధించి వేసిందేమో ననిపించింది. ఆమెకు సపర్య చేస్తూ అక్కడే నిలిచిపోదామా అనిపించింది. కాని మా నాన్న నన్ను తప్పక రమ్మని రాసినవుత్తరం ఇంకా చొక్కాజేబులోనే వుంది. ఇంటిమీద మమతచేత ప్రయాణం మానుకోవాలనిపించలేదు. ఇంతలోకే నాయుడు పక్కగదిలోనుంచి ఔన్సు గ్లాసులో మందు తీసుకొనివచ్చాడు.

నన్ను చూచి నాయుడు, "ఏమండీ?" అన్నాడు.

"ఇవ్వాళ మా వూరి వెళ్ళిపోతున్నాను."

సరళ నా వైపు అతి దీనంగా చూచింది; ఏమో మాట్లాడబోయి వూరుకుంది.

"మీ కాలేజీకి శెలవలిచ్చారా?" నాయుడు అడిగాడు.

'అవున'న్నట్టు నేను తలవూపాను.

"మళ్ళీ ఎప్పుడు వస్తారు?" - నాయుడు అడిగాడు కూతురు మంచం మీద కూర్చుంటూ.

"వచ్చేవారంలో వచ్చేస్తాను."

నిజంగా నేను తిరిగిరావటం రెండు వారాలకే కాని నిజంచెప్తే సరళ కలవర పడుతుందేమోనని అల్లా చెప్పాను.

సరళ నా వైపు అతి దీనదృక్కుల్ని ప్రసరింపజేస్తోంది.

"అమ్మాయికి జ్వరం అల్లానే వుందండీ! రెండురోజుల్లో తగ్గుతుందని డాక్టర్ చెప్తున్నాడు"- నాయుడు కూతురుచేత మందు తాగిస్తూ చెప్పాడు.

"ఈ జ్వరం మేముందిలెండి- రెండు రోజుల్లో తగ్గిపోతుంది"- నేను ధైర్యంచెప్తూ అన్నాను.

చేతిగడియారాన్ని చూచాను. బండికి ఇంకా అరగంట టైముంది.

'ఫరవాలేదులే' అన్నట్టు సరళవైపు చూచి, 'వెళ్ళివస్తా నాయుడుగారూ" అన్నాను.

"మంచిది- మళ్ళీ త్వరలో రాండి" అంటూ నాయుడు నన్ను సాగనంపాడు.

## 5

"మావూరు వెళ్ళానన్న మాటేగాని - నా మనస్సంతా నాయుడి ఇంటి మీదనే వుంది. ఆనాడు సరళకూ నాకూ జరిగిన సంభాషణను తలుచుకుంటూ, నాకు నేనే ఏవేవో ఆకాశహర్మ్యాల్ని కల్పించుకుంటూ కమ్మని కలల్ని కంటూ వచ్చాను. రెండువారాల శెలవలూ త్వరగా అయిపోతే బాగుండుననిపించేది. అన్నింటికన్న సరళకు ఎల్లావుందో తెలుసుకోవాలని మరీవుండేది.

శెలవలు కాకపూర్వమే గుంటూరు వెళ్తానని మా నాన్నతో చెప్పాను. "పండక్కు అక్కడ ఎందుకు, ఇక్కడే వుండ"మని ఆయన జవాబు. ఎక్కువ మాట్లాడలేక వూరుకున్నాను.

ఎల్లాగో కళ్ళుమూసుకొని దసరా శెలవలు గడిపివేసి- ఇంకా రెండు రోజులకు కాలేజీ తెరుస్తారనగా, నాన్నను ఏదో విధంగా సమాధాన పరచి గుంటూరు ప్రయాణమయ్యాను.

రాత్రి బండిలోపడి గుంటూరు జేరుకున్నా. నేను గదికి వెళ్లేప్పటికి రాత్రి పదకొండు గంటలవుతుంది. జట్కా వాడికి డబ్బిచ్చి పంపేశాను. గదిలోని గుడ్డి లాంతర్ను వెలిగించాను.

బయిట పిండారబోసినట్లు వెన్నెల; వీధంతా మాటు మణిగింది. దూరాన కుక్కల మొరుగులు తప్ప ఏ యితర శబ్దమూ వినిపించటంలేదు. మెల్లిగా వీచేగాలికి చెట్లకొమ్మలు నెమ్మదిగా ఉయ్యాలలూగుతున్నాయి. నాలో వివిధ భావాలు రేకెత్తించేట్టున్నది- ఆ రాత్రి!

సరళకు ఎల్లా వుందో తెలుసుకోవాలని వుంది. మెట్లు దిగి దొడ్లోకి వెళ్లా లనిపించింది. మెట్ల వైపు చూచాను.

ఎవరో వొక స్త్రీ పైకి ఎక్కి వస్తోంది. నాకేమీ భయం వెయ్యలేదు గాని ఎవరా అని సందేహం మాత్రం కలిగింది. లేచి నాలుగడుగులు ముందుకు వేసి ఆ వ్యక్తి సరళేనని గ్రహించగలిగాను.

ఆమెను మావూరు వెళ్తూ చూచినప్పటలా లేదు. ఆమెలో పూర్వపు అందమంతా తిరిగి ప్రతిఫలిస్తూవుంది. బహుశా తిరిగి ఆమె తన సంపూర్ణారోగ్యాన్ని పొంద గలిగిందనుకున్నా. ఆ అర్ధరాత్రి సమయంలో ఆమె నాగదికి ఎల్లా రా సాహసించిందో నాకు అర్థమవలేదు.

"సరళా!" అన్నా కొద్ది అనుమానంతో.

"ఊఁ" అంది వంచిన ముఖాన్ని కొద్దిగా పైకి ఎత్తుతూ.

"నీకు జ్వరం నిమ్మళించిందా?"

"అవును. వారంరోజుల్లో తిరిగి వస్తానన్న పెద్దమనుష్యులు కాదూ?" – ఆమె నవ్వుతోంది: ఆమె నవ్వు వెన్నెల కాంతుల్లో కలిసిపోయింది.

నేను కూడా లేని నవ్వును నటిస్తూ ఆమె రెండు చేతుల్ని పట్టుకొన్నాను.

"త్వరలో వద్దామంటే వీలయిందికాదు" నేనేదో కుంటి సమాధానం చెప్పాను.

"పాపం!" ఆమె సానుభూతిగా అంది. ఒక్క క్షణం నిశ్శబ్దం.

"నేనిప్పుడే వచ్చాను. అప్పుడే నీకెల్లా తెలిసింది?"

"ఎల్లాగో" అని ముక్తసరిగా సమాధానం చెప్పింది.

ఆమె ఇల్లా సాహసించి రావటంచూస్తే ప్రేమ గుడ్డిదనే సిద్ధాంతం రూఢిపడ్డది. ఆమె నన్ను ప్రేమిస్తోందనే విషయం ఇంతతో ఢంకామీద దెబ్బకొట్టి చెప్పినట్లయింది.

"ఈ చలిగాల్లో ఉంటే నీకు జబ్బు చేస్తుందేమో! గదిలోకి వెళ్దాం."

"గదిలో మీ గుడ్డిలాంతరు వెలుగుకన్న చందమామ చల్లని వెన్నెలే బాగుంది."

"సరళా! నీ తల్లో గులాబీపువ్వు నాకోటివ్వవూ?"

"ఎందుకూ?"

"వాసన చూచుకొనేందుకు."

"తీసుకో."

ఆమె నాదగ్గరకు వచ్చి నిలబడ్డది. నేను ఆమె తల్లోని గులాబి పువ్వును లాక్కొన్నాను. ఆ పువ్వులోవున్న సగం అందం చచ్చింది.

"ఇది నీ తల్లో వుంటేనే బాగుంది."

"మరి కావాలన్నావుగా."

ఆమె ఆకాశంలోకి చూస్తోంది.

"ఆకాశంలో ఏముందని అల్లా చూస్తావు?"

"చల్లని చంద్రుడు బాగుండలేదూ?"

"అంతకన్నా నీవు బాగున్నావు!"

"ఈ ముఖస్తుతులకు ఏమిలే!"

"నిజం సరళా!"

"బాగుంటే?"

"నీ అందాన్నంతా తాగేస్తున్నాను."

"కవిత్వం కూడా వచ్చు."

సరళ నా చెంపమీద సరళంగా దెబ్బవేసింది.

ఆమెను దగ్గరకు లాక్కున్నాను.

"అబ్బ! వూరుకో" ఆమె నా చేతుల్లోంచి తప్పించుకోజూచింది; కాని సాధ్యపడలేదు.

ఆ శేషించినరాత్రి ఆమెతో గడిపాను.

చంద్రుడు క్షీణకాంతుల్తో పశ్చిమదిశకు పరుగులెత్తుతున్నాడు. వేగుచుక్క ఉదయిస్తోంది; కోడికూసింది.

"ఇంక నేను వెళ్ళాలి" - ఆమె అన్నది నా చల్లని చేతిని తన చెక్కిళ్ళకు అదుముకుంటూ.

"అప్పుడేనా?"

"తెల్లవారుతోంది; అందరూ లేస్తారు" ఆమె లేచేందుకు ప్రయత్నిస్తోంది.

"ఇంకొంచెంసేపు వుండరాదూ?"

"కాదులే."

ఆమె వెనుదిరిగిచూస్తూ, వెనక్కులాగేకాళ్ళను ఈడ్చుకుంటూ మేడమెట్లు దిగిపోయింది. ఆ మధురక్షణాల్ని తల్చుకుంటూ నేను కన్నుమూశాను.

## 6

"మర్నాడు ఉదయం నాయుడి ఇంటిముందొక జట్కా ఆగింది. దాంట్లోనుంచి నాయుడు ఆయన భార్యా దిగారు. నాయుడుభార్య పెద్దపెట్టున ఏడుస్తోంది. ఏమిటో నా కర్థంకాక, మేడ దిగివచ్చాను. నాయుడి ముఖం పాలిపోయి దీనంగా వుంది.

ఇరుగుపొరుగు వాళ్ళు అప్పటికప్పుడే పోగై నాయుణ్ణీ, నాయుడు భార్యనూ ఓదారుస్తున్నారు. నాకు అదంతా అగమ్యగోచరంగా వుంది.

పోగైనవాళ్ళలో ఒక శాస్త్రులుగారిని ఇవతలికిపిలిచి "ఎందుకు ఏడుస్తున్నారు?" అని అడిగాను.

"ఆఁ ఏంలేదు- వాళ్ళమ్మాయి చనిపోయింది."

నానెత్తిమీద పిడుగుపడ్డట్టయింది. రాత్రంతా నాకు అమిత ఆనందాన్నిచ్చిన సరళ చనిపోయిందా? నేను నమ్మలేకపొయ్యాను.

"ఎప్పుడు?" అని మళ్ళీ శాస్త్రిని అడిగాను.

"అవుతుంది- పది రోజులు" శాస్త్రి అన్నాడు పిలక సవరించుకుంటూ.

అబద్ధం! పది దినాలక్రితమే ఈ లోకాన్ని బాసిన సరళ రాత్రి నాతో వెన్నెలవిహారం ఎల్లా చేయగలిగింది? వీరంతా భ్రమిస్తున్నారేమో ననుకున్నా.

"శాస్త్రులుగారూ! ఇది నిజమేనా?" నేను అడిగాను అమిత సందేహంతో.

"ఏమిటయ్యా! పిచ్చివాడిలాగున్నావు. ఊరికే ఎందుకు ఏడుస్తారు?"

నే నిది నమ్మనా? మాననా?

నాయుడి భార్య ఏడుపును పట్టిచూస్తే ఇదంతా కూతురికోసమే అన్నట్టుగావుంది. ఇరుగు పొరుగు అమ్మలక్కల ఓదార్పునుపట్టి చూచినా ఇదే తేలుతూవుంది. చివరకు సరళ పది దినాల క్రితమే చనిపోయిందని నాయుడి నోటి వెంటనే విన్నాను. ఇంక నమ్మకుండా వుండేదెల్లా?

ఆ తరువాత నాకు అమిత సందేహం కలిగింది. రాత్రి నా గదికి వచ్చిన "సరళ" ఎవరా అని. నేను రాత్రి భ్రమించానేమో ననుకున్నా. జేబు తడివి చూసుకున్నా. ఆమె దగ్గర తీసుకొన్న గులాబిపువ్వు నలిగి వాడివుంది.

ఈ విషయాన్ని ఆ పగలంతా తరిచి చూచాను. రాత్రి నాకు ఆ ఆనందాన్నిచ్చింది సరళేనని రూఢిపరుచుకొన్నాను. ఎల్లా సాధ్యమయిందా అనేది పెద్ద సమస్య అయింది.

చిన్నప్పుడు మా తాత చెప్తూండేవాడు; "ఏదన్నా పెద్ద కోరికతో చనిపోయిన వాళ్లు దయ్యమై తమ కోరిక ఫలించేటంతవరకూ భూలోకంలో సంచరిస్తూవుంటారు."

చివరకు ఇదే నిజమై వుంటుందని, దృఢపరచుకున్నా.

ఆ తరువాత మళ్లీ ఎప్పుడన్నా- ఆ రాత్రి లాగు సరళ కన్పిస్తుందేమో ననుకున్నా - కాని అప్పటికీ ఇప్పటికీ కూడా ఆమె స్వరూపమే నా కళ్లపడలేదు."

* * *

ప్రకాశం కథ ముగిసింది. నాలో వివిధ భావాలు రేకెత్తేయి.

"అయితే నీవు అనుభవించింది దయ్యాన్నన్నమాట" నేను అడిగాను కొద్ది ఆశ్చర్యంతో.

"అన్నమాటేమిటి? దయ్యమే!"- ప్రకాశం నిక్కచ్చిగా చెప్పాడు.

"మఱి దయ్యమంటే గాలేగా!"

"దయ్యంకాక- మఱిదాన్నేమంటావు?" ప్రకాశం ఎదురు ప్రశ్న వేశాడు.

"ఏమో!" - నాకు సమాధానం చెప్పేందుకు ఇంకేమీ దొరకలేదు.

"నాకు కూడా ఇప్పటి దాకా సందేహమే! ఆ రాత్రి సంఘటనను నమ్మనా? మాననా?"

నాకు ఇది అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ కూడా సమస్యే!